# రహస్యం

## ఆర్. దమయంతి

అక్కడ జనం గుమిగూడి వున్నారు. అందరూ ఉత్కంఠభరితంగా దేనికోసమో ఊపిరిబిగపట్టి మరీ చూస్తున్నారు.

జరుగుతున్న వింత ఏమిటంటే...

ఒక యువకుడు...తన వాక్చాతుర్యంతో అందర్నీ మంత్రముగ్థుల్ని చేస్తున్నాడు. అందరూ శ్రద్ధగా వింటున్నారు.

''మీ అందరికీ ఒక అద్భుతమైన వింత చూపిస్తాను. ప్రపంచంలో ఎవరికీ లేని సిరి. సంపద. ఐశ్వర్యం. నాకు మాత్రమే సొంతమైనది. శాశ్వతమైనది. మరెవరూ దోచుకోలేనిది. నానుంచి కొనలేనిది. అమ్మకూడనిది. అత్యంత సౌందర్యవంతమైనది. వెల కట్టలేనిది. కోట్లు పోసినా దిగదిడుపయింది.... ఒకటి నా దగ్గర వుంది..'' అంటూ పూరించాడు.

''ఏమిటదీ... ఏమిటదీ...'' జనాలంతా గుసగుసలాడారు.

''చెప్తా...చెప్తా...''

''చెప్తారా? మరి అంత విలువైనది కేవలం మాటల్లోనే చెప్తారా?''

''లేదు. చూపిస్తా....చూశాక మీరే అంటారు... ఎంత అందమైనదో వర్ణిస్తారు....'' ఎంతో ఆత్మవిశ్వాసంతో అన్నాడు..

మరి కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి.

రావి చెట్టుకింద జనం... ఎక్కడివాళ్లక్కడ..నిలబడిపోయారు. శిలలా అన్నట్టుండిపోయారు. ఆకాశం కదలడం ఆగిపోయింది. భూమి సూర్యుని చుట్టూ తిరగడం క్షణం పాటు ఆగింది. రావిచెట్టు కొమ్మలు గాలికి వూగడంతో...ఆకుల శబ్దం ఆ నిశ్శబ్దంలో ఒక హోరులా విన్పిస్తోంది...



కాలం సయితం క్షణం కాలం పాటు అక్కడే ఆగిపోయింది .

అంతే...

అతను అంటున్నాడు.... ''ఇదిగో చూడండి'' అంటూ తన హృదయాన్ని చీల్చి చూపించాడు...

జనం అంతా మొదట అవాక్కయ్యారు. ఆ తర్వాత గుసగుసలు పోయారు. ఆనందం ఆపుకోలేక కేరింతలాడారు. చప్పట్లు చరిచారు. యువకులు ఈలలేసి తమ ఆనందాన్ని తెలిపారు. ఆడవాళ్లు కళ్లప్పగించి అలాగే చూస్తుండిపోయారు. పెద్దలు తమ హర్షాన్ని మాటల్లో తెలిపే ప్రయత్నం చేస్తున్నారు కానీ.. సాధ్యపడటం లేదు.

అందరి నోటా ఒకటే మాట...

''అబ్బ....రవివర్మ హృదయం ఎంత సౌందర్యంగా వుంది. అలా వుండటం ఎలా సాధ్యమో.. ఏమో... ఎంత అదృష్టవంతుడని...'' అంటూ అందరూ అతన్ని ఆకాశానికెత్తేస్తున్నారు.

ఆ పొగడ్తలు వింటున్న రవివర్మ ఛాతీ మరింత విశాలమైంది. మనిషి ఆకాశాన్నంటే వృక్షంలా అయిపోయాడు. సముద్రమంత ఆనందమేసింది.

అక్కడ వాతావరణమంతా సంతనాటి సందడిగా మారింది.

ఇంతలో అక్కడకి ఒక ముసలి వాడు వచ్చాడు.

''ఏమిటి సంగతి '' అని అడిగాడు.

విషయం తెలుసుకున్నాడు.

వెంటనే జనాన్ని తోసుకుంటూ ముందుకెళ్లి రవివర్మ ముందు నిలబడ్డాడు.

రవివర్మ అంటున్నాడు...''చూశారు కదా! మీలో ఎవరికయినా సరే..నాకంటే అందమైన హృదయం వుంటే ముందుకు రండి.. పందెం కాయండి...'' అంటూ సవాల్ విసిరాడు.

వెంటనే ముసలాయన సవాల్‌ని ఎదుర్కొంటూ....''నేనున్నాను. నీకన్నా అందమైన హృదయం నాకుంది.'' అన్నాడు ధీమాగా.

జనం అంతా విస్తుపోయారు.

రవివర్మ ముసలాయన వంక చూసి హేళనగా అన్నాడు...''ఏమిటి నాతో పోటీనా నీకు?... ఓడిపోతావు జాగ్రత్త..'' అంటూ హెచ్చరించాడు.

''ఓడిపోను...'' అంతే ఖచ్చితంగా చెప్పాడు ఆ పెద్దాయన.

''అయితే...పందెమా?'' రెట్టించాడు.

''పందెం'' అంతే మెరుపు వేగంగా జవాబిచ్చాడు.

ఒక్క క్షణం సందేహించినా వెనకాడదలచుకోలేదు రవివర్మ. ''సరే. అయితే ఇలా పైకి ... ఈ ఎత్తు గడ్డమీదకు రా...'' అంటూ వేదిక మీదకు ఆహ్వానించాడు.

వెంటనే కదిలి వెళ్లాడు.

''నీ హృదయం పరచు...''

''ఇదిగో...'' అంటూ తన హృదయాన్ని కూడా విప్పాడు.

అది- రవివర్మ హృదయమంత అందంగా లేదు. అతుకుల బొంతలా వుంది. అక్కడక్కడ చిల్లులు పడి అసహ్యంగా కన్పిస్తోంది. నల్లటి మచ్చలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. అతుకుల బొంత లాంటి ఆ హృదయాన్ని చూసి- ఫక్కున నవ్వాడు రవివర్మ.

''ఏమిటి అన్నావ్... నీ హృదయం నా హృదయం కంటే అందమైనదా? ఇన్ని అతుకుల బొంతని అందమైనది అంటూ ప్రగల్భాలు పలుకుతావా? నా హృదయంలా చెక్కుచెదరని సౌందర్యమా ఇతనిదీ? ప్రజల్లారా మీరే చెప్పండి తీర్పు? మతిమాలిన ఈ ముసలోడికి మీరే బుద్ధి చెప్పండి...'' అంటూ ప్రజలను రెచ్చగొట్టాడు.

పెద్దాయన బదులుగా నవ్వి...

''అవును. నా హృదయం నిండా గాయాలే... ఎందుకంటే... ఆపదల్లో వున్నవారిని చూసి నా హృదయం ద్రవించడం వల్ల...గాయాలయ్యాయి. నా హృదయం నిండా నల్లటి మచ్చలే. నేను మేలు చేసినవారు తిరిగి నాకు మేలు చేయకపోగా...కీడు తలపెట్టినందుకు మ్లానమైన హృదయం ఇది... ఇక గుంటలంటావా...నా హృదయాన్ని తవ్వి...కరణ రసాన్ని తోడి ఎంతో మంది ఆర్తులకు అందించి బ్రతికించాను... అతుకుల గురించి అంటావా...హృదయంలేని వారికి నా హృదయం కోసి యిస్తూ వస్తున్నా... కొంత మంది తిరిగి యివ్వక పోవడంతో ఆ లోతు అలాగే వుండిపోయింది. మరికొందరు తిరిగి యిచ్చిన ముక్కను అతికించుకోవడం వల్ల నీకది అతుకుల బొంతలా కన్పిస్తోంది...అంతే...'' అంటూ వివరించాడు.

ఎవ్వరికీ ఏమీ యివ్వకుండా ...పుచ్చుకోకుండా...చెక్కుచెదరకుండా తన హృదయాన్ని చూసి సిగ్గుపడ్డాడు రవివర్మ.

ప్రజలకు తను ఇప్పటిదాకా ప్రదర్శించింది అసలైన సౌందర్యం కాదనే సత్యం అతనికి అవగతమైంది.

ఎదురుగా ముసలాయన జ్ఞాన తేజస్సుతో సూర్య బింబంలా కన్పిస్తున్నాడు. తన అహాన్ని పారద్రోలి, విజ్ఞాన దీపికను వెలిగించిన గురువులా గోచరమయ్యాడు.

అంతే... ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదతను. వెంటనే తన హృదయాన్ని ఒక చిన్న ముక్కగా కోసి- పెద్దాయన గుండె మీద ఒక గుంటను పూడ్చాడు.

రవివర్మ హృదయంనుంచి రక్తం స్రవించకుండా తన చేయి అడ్డుపెట్టాడు పెద్దాయన.

కాసేపు తర్వాత చూస్తే...కొంచెం ఖాళీ అయిన హృదయం ఎంతో నిండుగా కన్పిస్తోందతనికి.

పట్టలేని ఆనందంతో... ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

అప్పటికే వెళ్లిపోతున్న పెద్దాయన అడుగుజాడలను అనుసరిస్తూ బయలుదేరాడు.

హృదయం వుంటే సరిపోదు. దాన్ని పంచుకోవడంలోనే అసలైన అందం, ఆనందం వుంటుంది. అదే సృష్టిలోని గొప్ప సౌందర్య రహస్యం.

★

